

రూ.6 వేలు పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వృద్ధ కళాకారులకు నెలకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామిని కోరారు. సోమవారం స్థానిక జనసేన కార్యాలయంలో కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కింతాడ సన్యాసిరావు, జిల్లా అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులుగా కళారూపాల ప్రదర్శన కోసం తమ జీవితాలను అంకితం చేశామని అన్నారు. కళాకారులు వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారని అన్నారు. కనీసం నెలకు రూ.6 వేలు పింఛన్ ఇచ్చి ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలో విలీనమెప్పుడు..?

- 6 పంచాయతీల ఎదురుచూపులు
- సమస్యలతో సహవాసం చేస్తున్న ప్రజలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

2011 ఆగస్టు 22న ఇంద్రపాలెం, రమణయ్యపేట, 2012 ఫిబ్రవరి 14న చీడిగ, తూరంగి, వలసపాకల, వాకలపూడి పంచాయతీల పాలక వర్గాల కాల పరిమితి ముగిసింది. అప్పటి నుంచి ఈ గ్రామాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో కాకినాడ నగరపాలక సంస్థను ఆనుకోని ఉన్న ఈ గ్రామాలను కార్పొరేషన్లో ఎప్పుడు విలీనం చేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇటు పాలకులు లేక, అటు సమస్యలను పరిష్కరించే సరైన అధికారుల స్పందన కరువై ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మౌలిక సదుపాయాల విషయంలో సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా తాగునీటి కోసం కటకటలాడుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువైన నేపథ్యంలో 13 ఏళ్లుగా విలీన గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రతిపాదనతో సరి

కాకినాడ పురపాలక సంఘంగా ఉన్నప్పుడే కాకినాడ రూరల్ మండలంలో ఉన్న 14 గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. దీంతో 1987 నుంచి 1995 వరకూ పంచాయతీ ఎన్నికలు నిలిచిపోయి ప్రత్యేకాధికారుల పాలన సాగింది. మరలా 1995 నుంచి యథావిధిగా ప్రాదేశిక ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. 2005 జనవరి 10న కాకినాడ పురపాలక సంఘం నగరపాలక హోదా సాధించింది. 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణీకరణ పెంచాలని తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిసర గ్రామాలను విలీనం చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాకినాడ నగర పాలక సంస్థ విస్తరణకు సంబంధించి కాకినాడ రూరల్, సామర్లకోట, పెదపూడి, తాళ్లరేవు, కరప మొత్తం 37 గ్రామాలను ప్రతిపాదించగా ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అయింది. దీంతో అప్పటి ఎంఎల్ఎ వెకురసాల కన్నబాబు జోక్యం చేసుకుని గ్రామాల సంఖ్యను కుదించారు. 2014లో స్వామి నగర్, ఎస్.అచ్చుతాపురం, గంగనాపల్లి టీచర్స్ కాలనీ ప్రాంతాలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. అయితే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ ప్రాంతాల ప్రజలు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం దక్కలేదు. మిగిలిన 6 గ్రామాల విలీనం 13 ఏళ్ళు గడిచినా అతీగతి లేదు. దీంతో పంచాయతీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పన అంతంత మాత్రంగానే ఉంటున్నాయని చెబుతున్నారు. తక్షణమే ప్రతిపాదిత గ్రామాలను విలీనం చేసి కార్పొరేషన్ ద్వారా పౌర సేవలు అందించాలని కోరుతున్నారు.

సమస్యలతో సతమతం

6 గ్రామాల్లో లక్షమంది పైనే జనాభా నివశిస్తున్నారు. 13 ఏళ్లుగా ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఇటు ఆయా గ్రామాలకు సర్పంచుల పదవీకాలం ముగిసి ఏళ్లు గడుస్తున్నాయి. అటు నగరపాలక సంస్థలో విలీనం కాక, కార్పొరేటర్లు కూడా లేరు. ఈ నేపథ్యంలో ముఖ్యంగా గ్రామస్తులంతా తీవ్ర త్రాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. అద్వాన్న పారిశుధ్యంతో రోగాల పాలవుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో సమస్యను చెప్పుకుంటే వినే నాధులు కూడా కరువయ్యారు. పలు ప్రాంతాల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగకపోవడంతో చీకట్లు అలుముకుంటున్నాయి. వీధి కుక్కల స్వైరవిహారంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు.

విలీనం చేసి ఎన్నికలు నిర్వహించాలి



13 ఏళ్ల క్రితం విలీన ప్రతిపాదన చేసి అప్పటి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తరవాత కాలంలో రెండు ప్రభుత్వాలు మారినా విలీన అంశాన్ని పక్కన పెట్టేసాయి. దీనివల్ల ఈ గ్రామాలు అనేక సమస్యలను ఎదుర్కొం టున్నాయి. నూతన ప్రభుత్వం స్పందించి విలీన సమస్యకు పరిష్కారం చూపాలి. వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

-పలివెల వీరబాబు, మాజీ సర్పంచ్, ఇంద్రపాలెం.



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్, అనంతరం అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

సమిష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి

-కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షన్మోహన్ వెల్లడి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అందరి భాగస్వామ్యంతో కృషి చేస్తానని కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. కాకినాడ జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సగిలి షన్మోహన్ సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పుష్కలమైన వనరులతో ప్రగతిశీల జిల్లాగా కాకినాడ జిల్లాకు రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉందని అన్నారు. జిల్లా విశిష్టతల గురించి తనకు ముందు పనిచేసిన జిల్లా కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. ఘనమైన చారిత్రక నేపథ్యం కలిగిన కాకినాడ జిల్లా స్వరూపం, స్థితిగతులపై సమగ్ర అవగాహనను సత్వరం పెంపొందించుకుని సత్వరాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల లబ్దిని అర్హులైన వారందరికీ అందిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాను ప్రగతి పథంలో ముందుకు నడిపించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు

ఒత్తిడికి, ప్రలోభాలకు లొంగి తప్పులు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కలెక్టర్ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార సమావేశ హాలులో వివిధ శాఖల అధికారుల పరిచయం, వారివారి శాఖల ద్వారా అమలౌతున్న కార్యక్రమ వివరాలను తెలుసుకున్నారు. జనరంజకమైన సమర్ధ పాలన, సేవలు సజావుగా ప్రజలకు అందించేందుకు అధికారులు అందరూ సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని కోరారు. సంక్లిష్టమైన, వివాదస్పదమైన ఎటువంటి అంశాలు ఎదురైనా తప్పని సరిగా ముందు తనకు తెలియజేయాలని, తగు పరిష్కారంతో వారికి అండగా నిలుస్తానని అన్నారు. వత్తిడులు, ప్రలోభాలకు లోనై తప్పుచేస్తే ఉపేక్షించనని ఆయన హెచ్చరించారు. ప్రజలకు సేవలు అందించేందుకు ఎల్లవేళలా సంసిద్ధంగా అందుబాటులో ఉండాలని, ప్రధాన కార్యస్థానం విడిచి వెళ్లేపుడు తప్పని సరిగా తనకు తెలియజేయాలన్నారు.

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

వివేకానంద సమావేశం హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజల నుంచి వివిధ సమస్యలకు పరిష్కారం కోరుతూ సమర్పించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ, వాటిపై సమగ్రమైన సత్వర పరిష్కారాలను ప్రజలకు అదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ కె.తిప్పేనాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీని అభివృద్ధి చేస్తా : ఎంఎల్ఎ నెహ్రూ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని చిల్లంగి గ్రామంలో ప్రజాభిమాని కీర్తిశేషులు కాళ్ల దొంగబాబుని స్ఫూర్తిగా తీసుకుని పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం ఆయన దొంగబాబు సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల కోసం పోరాడే ప్రజా నాయకుడు ప్రజాభిమాని దొంగబాబు లేకపోవడం దురదృష్టకరమని, దొంగ బాబు స్ఫూర్తితో జగపతినగరం గ్రామపంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తోట నవీన్, ఎస్‌విఎస్.అప్పలరాజు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి, కిర్లంపూడి మండల పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, గండేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, గ్రామ సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ నానాజీని కలిసిన ఎపిఎన్‌జిఒలు

ప్రజాశక్తి - కరప

మండల ఎపిఎన్‌జిఒ నాయకులు ఎంఎల్ఎ పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన స్వగృహానికి చేరుకున్న ఉద్యోగ సంఘాల నాయకులు డిఆర్‌వి.చౌదరి, కె.వెంకటరత్నం, కె.రాఘవ కుమార్, బి.సాయిలత, పి.చంద్రకళ, ఎస్.నాగమణి, ఎస్ కనకనాగేంద్రకుమార్, కె.కేశవరావు తదితరులు ఎంఎల్ఎకు పూలబొకేలు ఇచ్చి అభినందించారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కాకినాడ



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను ఎస్ఎఫ్ఐ బృందం విద్యార్థులకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు జూన్ 13వ తేదీన ప్రారంభమయ్యాయన్నారు. స్కూల్స్ ప్రారంభం అయి 10 రోజులు అవుతున్న నేటికీ కాకినాడ జిల్లాలో 7వ తరగతి విద్యార్థులకు ఒక్క పాఠ్య పుస్తకం కూడా అందించలేదన్నారు. పాఠ్య పుస్తకాలు లేకుండా విద్యార్థులు ఏ విధంగా చదువుకోవాలని ప్రశ్నించారు. తక్షణమే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది ఇచ్చే ఏకరూప దుస్తులు ఈ సంవత్సరం నేటికీ ఇవ్వలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులు పీల్చుకుని తింటున్నాయని, ఫీజుల నియంత్రణ చేయాలని, జిఒ నెంబర్ 2కి వ్యతిరేకంగా ప్రయివేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అమ్మకాలను నిషేధించాలని, అటువంటి విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.మణికంఠ, కాకినాడ రూరల్ అధ్యక్షులు రాజేష్, రూరల్ నాయకురాలు వర్షిక, నగర నాయకులు జయరాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కృషి : చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యాబోధనలో మేటి పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం స్థానిక దర్గా సెంటర్‌లోని సాగర్ మున్సిపల్ పాఠశాలలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన గ్రాడ్యుయేషన్ డే ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యాభివృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. వీరికి సంక్షేమ పథకాలు కూడా అమలు చేస్తుందన్నారు. సిడిపిఒ ఉష మాట్లాడుతూ 25 అంగనవాడి కేంద్రాలలో ప్రీ స్కూల్ బాలలు 97 మందిలో 79 మంది ప్రభుత్వ పాఠశాలల్లో, 18 మందిని కాన్వెంట్లలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ సత్యవేణి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, మున్సిపల్ కౌన్సిలర్లు ఒబిలిశెట్టి నూకరత్నం, సిమ్మ సూర్యావతి, గడపా రామలక్ష్మి, మామిడి దుర్గాభవాని, ఎంఇఒలు ఈరంకి ప్రభాకర్ శర్మ, వి.రామకృష్ణచౌదరి, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, ఎసిడిపిఒ జ్యోతి, సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఆంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



పరిశ్రమ వద్ద జరుగుతున్న ధర్నాలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

'కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 26వ తేదీన జెసిఎల్‌తో నిర్వహించే జాయింట్ మీటింగ్‌లోగా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. రాక్ సిరామిక్ కంపెనీ ఎదుట కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమవారం 14వ రోజు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను తొలగించి 70 రోజులు పూర్తయైన యాజమాన్యం కాలయాపన చేస్తూనే ఉందన్నారు. ఈ నెల 26వ తేదీన జెసిఎల్ వద్ద జాయింట్ మీటింగ్ ఉందని, ఈలోపుగానే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ గేటు ముందు నిరసన వ్యక్తం చేయడానికి అనుమతి తీసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నిరసన తెలియజేసే హక్కు తమకు ఉందని, కంపెనీ నుంచి అక్రమంగా ఎందుకు తొలగించారో దానికి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్ రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో రాయితీపై విత్తనాలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలను రాయితీపై ఇస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి తెలిపారు. రైతన్నలు ఎక్కడపడితే అక్కడ విత్తనాలు కొని మోసపోవద్దని, రైతు భరోసా కేంద్రాల్లో అవసరమైన మేర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు నారు పోసుకునే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధికి అవసరమైన మందులు రైతు భరోసా కేంద్రాల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, పలివెల శ్రీనివాస్, ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

ఎంపిటిసి నాగమ్మ మృతికి గుర్తుగా మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు



మొక్కలను అందచేస్తున్న నిర్వాహకులు

ఇటీవల అకాల మృతి చెందిన జార్జిపేట ఎంపిటిసి సభ్యులు మందపల్లి నాగమ్మ మృతికి గుర్తుగా పలువురికి ఆమె కుమారుడు మందపల్లి రాంబాబు పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. నాగమ్మ సంస్మరణ సభ జార్జిపేట పంచాయతీ ఎంఎల్‌కె నగర్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాగమ్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాప్రతినిధిగా ఆమె చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, వుంగరాల వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, మందాల గంగసూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, గుత్తుల సూర్యనారాయణ, జక్కల ప్రసాద్, కూనపరెడ్డి కామేశ్వరరావు, కడలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం : ఎస్‌పి


ప్రజాశక్తి - గండేపల్లి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్

విద్యార్థులం మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేనట్లయితే వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఎస్‌పి సతీష్ కుమార్ అన్నారు. సోమవారం సూరంపాలెం ఆదిత్య కళాశాలలో 'మాదక ద్రవ్యాలు-మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు' అనే అంశంపై ఒక రోజు సదస్సు జరిగింది. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా విద్యపై దృష్టి సారించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 5 నుండి 6 శాతం ప్రజలు ఈ మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నారని, వాటి వలన ఎన్నో ఆరోగ్య ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తద్వారా తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి కె.లతాకుమారి, ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌టివిఎస్.కుమార్, డీన్స్ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, డాక్టర్ కిషోర్, ఎన్ఎస్ఎస్ పిఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులు

ప్రజాశక్తి - యంత్రాంగం

సోమవారం జిల్లాలో పలు మండలాల్లో ఎంపిడిఒల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందికి అవగాహన కల్పించారు.



యు.కొత్తపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నారాయణరావు

యు.కొత్తపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పిహెచ్‌సి వైద్యులు, పంచా యతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ శాఖ అధికా రులతో ఎంపిడిఒ నారాయణరావు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుని అపారిశుధ్యం లేకుండా చూడాలని కార్యదర్శులను ఆదేశిం చారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి భాస్కర్‌రావు, ఆర్ డబ్ల్యుఎస్ జెఇ సంధ్య, ఎంఇఒ ప్రమోద్, పంచాయితీ కార్య దర్శులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలానికి చెందిన జి రాగంపేట గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ ర్యాలీని గ్రామ సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రమేష్‌బాబు, ఎఎన్ఎం సుభాషిణి, సత్యనారాయణ పాల్గొన్నారు. **కరప** మండలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం స్థానిక చంద్రన్న సమావేశ భవనంలో ఎంపిడిఒ కె.అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో అంటూ వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ కోటేశ్వరరావు, ఆర్‌ఎడబ్ల్యుఎస్ అధికారి వర్ధన్, ఇఒపిఆర్‌డి బి.సత్యనారాయణ పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎం, ఇతర వైద్య సిబ్బందితో ఎంపిడిఒ బడే రాజేశ్వర రావు సమీక్షించారు. సీజనల్ వ్యాధులు సక్రమించకుండా క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారి ఎన్.సత్య ప్రసాద్, కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు రాంబాబు నాయక్, రవికుమార్, అభిషేక్, కార్యదర్శులు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

'త్వరలోనే అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తాం'

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎన్‌టిఆర్ ఆశయానికి అనుగుణంగా అన్న క్యాంటీన్లను తిరిగి త్వరలోనే ప్రారంభిస్తామని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సామర్లకోట మండలం మేడపాడు గ్రామానికి చెందిన మల్లెరెడ్డి రమాదేవి ఆర్థికసాయంతో అన్నదాన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో జగ్గంపేట, కిర్లంపూడి మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని, అయితే ప్రభుత్వం మారాక వైసిపి ప్రభుత్వం వాటిని నిలుపుదల చేసిందన్నారు. వాటిని ఇప్పుడు నిర్మించి అన్న క్యాంటీన్ నిర్వహిస్తామన్నారు. గోకవరం మండలానికి ఒక అన్న క్యాంటీన్ మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పోతుల మోహన్‌రావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

స్వయం శక్తితో ఆర్థికంగా స్థిరపడాలి : పంతం

ప్రజాశక్తి - కరప



కుట్టుమిషన్లు అందచేస్తున్న ఎంఎల్ఎ నానాజీ

మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా స్థిరపడి, వారి కాళ్లపై వారు నిలబడాలని ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. సోమవారం గుడారిగుంట ఆయన నివాసం వద్ద ఇద్దరి నిరుపేద మహిళలకు పంతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపూరు గ్రామానికి చెందిన విజయలక్ష్మి, నాగ వీరలక్ష్మి అనే ఇద్దరు మహిళలకు కుటుంబ పోషణ నిమిత్తం కుట్టుమిషన్లు అందించడం జరిగిందన్నారు. ప్రస్తుత సమాజంలో మగవాడి సంపాదనతో పాటు ఆడవారు కూడా ఎంతో కొంత సంపాదిస్తే కుటుంబం ఏ లోటు లేకుండా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కార్యదర్శి వేణు, జనసేన నాయకులు సలాది శ్రీను, శాండీ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలానికి చెందిన కొండేవరం ఇందిరా కాలనీకి చెందిన బండి చక్రధర్(26) తన నివాసంలో దూలానికి చీర కట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ఒక యువతితో 2021 నుంచి పరిచయం.ఉండడం, అప్పట్లో వివాహం కూడా చేసుకున్నారు. యువతి మైనర్ కావడంతో కుమార్తె సంబంధించి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో యువకుడుపై కేసు నమోదు చేయడం, ఇరువురు విరిపోవడం జరిగింది. ఈనెల 16న యువతి పుట్టినరోజు సందర్భంగా చక్రధర్ వెళ్లి కలిశాడు. ఈ నేపథ్యంలోనే ఆ యువతి తనను చక్రధర్ వేధిస్తున్నాడని కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ యువకుడు మనస్థాపానికి గురై సోమవారం చక్రధర్ ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకులు తెలిపారు. సంఘటన స్థలానికి పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఎస్ఐ స్వామినాయుడు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దు తగాదాలో గ్రూపులపై కేసులు

ప్రజాశక్తి - మామిడికుదురు

నగరం గ్రామంలో సరిహద్దు కొబ్బరి చెట్ల విషయమై తగాదా పడిన రెండు కుటుంబాలపై సోమవారం కేసులు నమోదు చేసినట్టు నగరం ఎస్ఐ సురేష్ తెలిపారు. నగరం కొత్త రోడ్డుకు చెందిన వెలుగొట్ల సూర్యకుమారి, వెలుగొట్ల విజయలక్ష్మి భూమి సరిహద్దులోని కొబ్బరి చెట్ల విషయమైయ ఘర్షణ పడ్డారు. గాయాలతో హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి స్టేట్‌మెంట్స్‌పై రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



రూ.17 లక్షల నకిలీ సిగరెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

విజిలెన్స్ అధికారులు సోమవారం అమలాపురం పట్టణంలో చేపట్టిన దాడుల్లో రూ.17 లక్షల విలువైన నకిలీ సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో మూడు షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ శాఖ, లీగల్ మెట్రోలజీ అధికారులు, కమర్షియల్ టాక్స్ అధికారులతో కలిపి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అమలాపురం పట్టణంలోని గొల్లగూడెం రామకృష్ణ వీధిలోని నిషిక ఎంటర్‌ప్రైజెస్‌ను తనిఖీ చేశారు. ఆ షాపులో రూ.14,33,600 విలువైన బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాల కేసులో షాపు యజమాని సంబంధిత వ్యక్తులపై కొట్పా యాక్ట్-2003 కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవుకు చెందిన నున్న వెంకట బుచ్చిరాజు, గుంటూరుకు చెందిన వెంకట్ అనే వ్యక్తి నుంచి సిగరెట్లను సేకరించి ఎస్‌విఆర్ఎన్ఎస్ సోబిత్ వారి ద్వారా నిషిక ఎంటర్‌ప్రైజెస్ వ్యాపార ప్రాంగణంలో ఉంచి రిటైల్‌గా స్థానిక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. యర్రమిల్లి వారి వీధిలోని వరలక్ష్మి జనరల్ మర్చంట్స్‌లో బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు హార్బర్ గోల్డ్, గోల్డ్ ఫిల్టర్, గోల్డ్ విమల్ వంటి రూ.1,09,200 విలువైన సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని, సంబంధిత వ్యక్తులపై కోట్పా యాక్ట్-2003 క్రింద క్రిమినల్ కేశారు. స్టాక్‌కు సంబంధించిన ఖాతాల పుస్తకాలు, కొనుగోలు అమ్మకాల బిల్లులను నిర్వహించడం లేదని జిఎస్‌టి అధికారులు గుర్తించారు. యర్రమిల్లి వారి వీధిలోని శ్రీదేవి జనరల్ స్టోర్స్‌లో రూ.1,98,730 విలువైన నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేకున్నారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కెవిఎస్‌వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిషేధిత సిగరెట్లను నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు పి.ముత్యాల నాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు, భార్గవ మహేష్, లక్ష్మీనారాయణ, నవీన్ కుమార్, జగన్నాథరెడ్డి, జీవా, లోవరాజు, వలీ, వీరబాబు కిషోర్ పాల్గొన్నారు.

యానాం చేరిన ఫ్రీజర్ బాక్సులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్స్‌లు పనిచేయకపోవడంతో ఈ నెల 11న యానాం యువత ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమస్యపై స్పందించి హోమ్ మంత్రి నమశివాయం, ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో సోమవారం ప్రభుత్వాసుత్రికి నాలుగు ఫ్రీజర్ బాక్సులు చేరుకున్నాయి. ఎంఎల్‌ఎ అశోక్ కృషితో ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రసాద్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి -కరప

కృష్ణా జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన గొర్రిపూడికి చెందిన గండి ధర్మవరప్రసాద్ కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.ఐదు లక్ష చెక్కును ఎంఎల్‌ఎ పంతం నానాజీ తనయుడు సందీప్ అధికారులతో కలిసి సోమవారం అందజేశారు. ప్రసాద్ భార్య వరలక్ష్మికి చెక్కును తహశీల్దార్ణ రామకోటేశ్వరరావు, డిటి అనిల్‌కుమార్, ఆర్ మాచర్రావు అందజేశారు.

ఎనిమిది అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక డివిజన్ పరిధిలోని పలు మండలాలకు సంబంధించి ప్రజల నుంచి 8 అర్జీలు అందాయని ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు.

ఆదిత్యలో అధ్యాపకులకు నైపుణ్యశిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నరారంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ప్రారంభమైంది. సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా 'పరిశోధకుల కోసం డేటా సైన్స్' అనే అంశంపై అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సిఎస్‌సి విభాగానికి చెందిన డాక్టర్ ఎ.సతీష్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ని డేటా సైన్స్ రంగానికి ఎలా అనుసంధానం చేస్తారో తగిన ఉదాహరణలతో వివరించారు. మంగళ, బుధవారాల్లో ఐఐఐటి డిఎంలో సిఎస్‌సి విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు, గురువారం రోజున జరిగే కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటిఆర్ఐ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ హెచ్.రవిశంకర్, శుక్రవారం జరిగే కార్యక్రమంలో ఎన్ఐసి శాస్త్రతవేత్త శంకర సుబ్బారావు మాట్లాడతారు. మొదటి రోజు ముగింపు కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్ ఎస్, డీన్ ఆర్ అండ్ సి డాక్టర్ కెవిఎస్ఆర్.మూర్తి, విభాగాధిపతి డాక్టర్ కె.స్వరూప, కోఆర్డినేటర్ డాక్టర్ టి.ప్రభాకరరావు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

చేపల వేటపై వైసిపి కౌన్సిలర్ల ఆగ్రహం



చేపల వేట పై అధికారులను హెచ్చరిస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ తాగునీటి చెరువులో చేపల వేట కొనసాగడంపై పలువురు వైసిపి కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పలువురు వైసిపి కౌన్సిలర్లు ఫిల్టర్ బెడ్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో చేపల వేట చేపట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో పెద్ద ఎత్తున అతిసార వ్యాధులు ప్రభలుతుంటే చెరువులో నీరు కలుషితం అయ్యేలా చేపలు పట్టడం ఏమిటని కమిషనర్ జె.రామారావును ప్రశ్నించారు. దీంతో చెరువు పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో ఉందని కమిషనర్ చెప్పడంతో కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ ఉబా జాన్‌మోజస్ మాట్లాడుతూ జిల్లాలో డయేరియా కేసులు పెరుగుతున్నాయని, చెరువులో చేపలవేటను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్‌కుమార్, మర్రి శేషారావు, వైసిపి నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, చిట్టిమాని శ్రీను, రెడ్డి వాసు, వారా సుధాకర్, కాళ్ళ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యానాం వార్తలు



మునిస్వామికి వినతిపత్రం ఇస్తున్న దినేష్

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక సావిత్రి నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్ కోరారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యానాంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా సావిత్రి నగర్, గిరియంపేట, దరియాలతిప్ప, పరంపేట మీదుగా హాస్పిటల్‌కి వచ్చే వారికి సులువుగా ఉంటుందని తెలిపారు. సమస్యలపై పరిపాలనాధికారి సానుకూలంగా స్పందించారన్నారు.

హుండీల ద్వారా రూ.3.82 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం



నగదును లెక్కిస్తున్న సేవకులు

మరిడమ్మ ఆలయ హుండీలను సోమవారం లెక్కించగా రూ.3,82,695 ఆదాయం సమకూరిందని అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ సి హెచ్.రామమోహన్‌రావు తెలిపారు. పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబు నాయుడు, ఇఒ సత్యనారాయణల సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ ఆసాధులు, స్వచ్ఛంద సేవకులు, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాదారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక రమణయ్యపేట పంచాయితీ గైగోలుపాడు కృష్ణాలయానికి చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై ఆలయ కమిటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. తూరంగిలో కుందూరు సుబ్బారావు అనే దాత కృష్ణాలయానికి 30 సెంట్లు భూమి ఇచ్చారని అన్నారు. ఆ భూమిని రాఘవరాజు అనే వ్యక్తి రోడ్డు, డ్రెయిన్, ప్రహరీ గోడను నిర్మించి ఆక్రమించాడని తెలిపారు. తప్పుడు రికార్డులు సృష్టించడానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఇదే అంశంపై కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి ఈనెల 26వ తేదీన సర్వే చేయించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇదిలావుండగా సోమవారం ఆలయ కమిటి సభ్యులు దేవస్థానం భూమిని పరిశీలించగా ప్రహరీ గోడ కట్టివుండటాన్ని గమనించారు. వెంటనే ఎంఎల్‌ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంఎల్‌ఎ సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా తక్షణమే ప్రహరీ గోడ పనులను నిలుపుదల చేయాలని సూచించారు. అలాగే కమిటీ సభ్యులు ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లోనూ, పంచాయతీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. వారంతా సానుకూలంగా స్పందించి ఆలయ భూమిని కాపాడుతామని భరోసా ఇచ్చారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మండలంలోని చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్లో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు కోరారు. సోమవారం విద్యార్థులు నిర్వహించిన 'అమ్మకు వందనం'ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గాయత్రి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి కనీసం 10 మంది విద్యార్థులు జూనియర్ కళాశాలలో చేరేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, పేద, అట్టడుగు కుటుంబాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, కొమ్మిరెడ్డి బుజ్జి, తుమ్మల నాని, రేలంగి బుజ్జి, మత్తాల రాజు, ఎగ్గాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతిరాలి కుటుంబాన్ని ఆదుకుంటాం:చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చినరాజప్ప

అతిసార వ్యాధితో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన జొన్నలదొడ్డికి చెందిన కొమ్మోజు సత్యవేణి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప హామీ ఇచ్చారు. సోమవారం సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు జొన్నలదొడ్డి అతిసారా ప్రబల ప్రాంతంలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. మృతురాలు సత్యవేణి ఇంటికి వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. గ్రామస్తులు ఆరోపించిన చెరువులో కాలుష్య జలాలు కలగకుండా డ్రెయినేజీలోకి వెళ్లేలా ప్రత్యేక పైప్ లైన్ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

మరో నాలుగు కేసులు నమోదు

కాగా సోమవారం జొన్నలదొడ్డి ప్రాంతంలో మరో నాలుగు అతిసార కేసులు నమోదైనట్లు వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.పార్థేష్ చెప్పారు. వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నామన్నారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న వారిని చికిత్స నిమిత్తం వేట్లపాలెం పిహెచ్‌సికి తరలించామన్నారు. ఈ కార్య క్రమంలో కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ జి.పద్మరూప, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, టిడిపి నాయకుడు గుమ్మళ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చినరాజప్పను సన్మానించిన ఉపాధ్యాయులు



చినరాజప్పను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లూథరన్ హైస్కూల్ ఉపాధ్యాయులు సోమవారం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్పను పెద్దాపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ, ఉపాధ్యాయోతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, 117 జిఒను రద్దు చేయాలని, 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం ఆపాలని, కెజిబివివి ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకుని వేతనాలు సక్రమంగా ఇవ్వాలని, ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాడు - నేడు పనులను పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.ఫిలిప్‌రాజ్, మండల అధ్యక్షులు సిహెచ్.విక్టర్ బాబు, ప్రధాన కార్యదర్శి విటివి.ఆచార్యులు పాల్గొన్నారు.

40 మంది విద్యార్థులకు ప్రవేశాలు

ప్రజాశక్తి - సామర్లకోట



చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ

నేను బడికి పోతా కార్యక్రమంలో 40 మంది విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించినట్లు ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం మండలంలోని గొంచాల ఎంపి ఎలిమెంటరీ పాఠశాల, మున్సిపాలిటీ పరిధిలోని కరప చెరువు బివిఆర్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల పరిధిలో గల అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠశాల పరిధిలో ప్రత్యేక ర్యాలీలు చేపట్టి బడి ఈడు గల పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలు నిర్వహించారు.

హెచ్‌ఎంపై ఎంఇఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు



ఎంఇఒకు ఫిర్యాదు చేస్తున్న ఎంపిటిసి, పిఎంసి ఛైర్మన్

తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని హెచ్‌ఎం నిర్వహించారని సుంకరపాలెం ఎంపిటిసి గుత్తుల శ్రీనివాస్, పిఎంసి ఛైర్మన్ పలివెల రాము ఎంఇఒకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సుంకరపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమాచారాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులకు హెచ్‌ఎం బి.సునీల్ సమాచారం ఇవ్వలేదంటూ సోమవారం ఎంఇఒకు వారు ఫిర్యాదు చేశారు. ప్రశ్నించిన తమపై పట్ల అవమానకరంగా మాట్లాడారని, హెచ్‌ఎంపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై ఎంఇఒ-2 మోకా ఉమా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తామని తెలిపారు.

సిహెచ్‌సి వైద్యురాలిపై సిబ్బంది ఫిర్యాదు

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలో ప్రధాన ఆసుపత్రి అయిన తాళ్లరేవు సిహెచ్‌సిలో చిన్నపిల్లల వైద్యురాలు స్నేహలత తీరుపై పలువురు ఆసుపత్రి సిబ్బంది సూపరింటెండెంట్ శిరీషకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా వైద్యురాలు స్నేహలత తమను దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషిస్తున్నారని ఆసుపత్రి ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్‌నర్స్ సునీత, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ శాంతి, పిఎం అసిస్టెంట్ శివకుమారి ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతిరోజు అసందర్భంగా రుస రుసలాడుతూ రోగులు ఉండగానే తమపై విరుచుకుపడుతున్నారని వాపోయారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న టెస్టులు సైతం బయట ల్యాబ్‌లకు రాస్తున్నారని చెప్పారు. వైద్యురాలు స్నేహలత తీరుతో ఆసుపత్రిలో విధులు నిర్వహించలేకపోతున్నామని ఆమెపై తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఆసుపత్రి సూపరిండెంట్ శిరీషను వివరణ కోరగా వైద్యురాలు స్నేహలతపై ముగ్గురు మౌఖికంగా ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా వైద్య శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

'ప్రజా సమస్యలను పరిష్కరించాలి'

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వల్లూరు రాజబాబు కోరారు. సోమవారం పెదపూడి రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో తహశీల్దార్ రాజ్‌కుమార్‌కు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీటి, పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. అతిసార వ్యాధులు ప్రభలమవుతున్న నేపథ్యంలో మండలంలో గ్రామాల్లోని పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మడికి సత్యం తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తకుప్పలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలానికి చెందిన చంద్రమాంపల్లి గ్రామంలో అనేక ప్రాంతాల్లో చెత్త పోగులు పేరుకుపోతున్నాయి. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అతిచార వ్యాధి ప్రబలి మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య నిర్వహణ పట్ల అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే తమ గ్రామంలో కూడా అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేలంగి వెంకట్రావు, ఎన్.శ్రీను, తాతబాబు, దొర తదితరులు మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామంలో పేరుకుపోయిన చెత్త పోగులన్నీ తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



గ్రామంలో దుర్వాసన కొడుతున్న పేరుకుపోయిన చెత్త